661) భైరవి

ప॥ జీవుడ నేనొకడను సృష్టికి గర్తవు నీవు। యీావల ధర్మపుణ్యము లివివో నీచేతివి॥

చ॥ పుట్టినయట్టిదోషాలు పురుషోతమా నీవు। పట్టి తెంచివేయక పాయనేరవు।
గట్టిగా సంసారములో గలిగినలంపటాలు। ముట్టి నీవల్ల నేకాని మోయరావు॥

చ॥ పంచభూతవికారాలు పరమాత్ముడా నీవే। కొంచక నీయాజ్ఞగాని కొద్ది నుండవు।
అంచెల జగములోనిఆయాసహజములు। వంచుక నీవల్లగాని వైపుగావు॥

చ॥ చిత్తములో విజ్ఞానము శ్రీవేంకటేశ నీవె। హత్తించి చూపినగాని యంకెకురాదు।
సత్తుగా నిన్నిటికిని నీశరణుజొచ్చితి మిదె। నిత్తెము గావ బ్రోవ నీయెచ్చే యికను॥